క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి



ముత్తుకూరు : ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నాబార్డ్ డీడీఎం రవిసింగ్ అన్నారు. ముత్తుకూరులో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రిజర్వ్ బ్యాంకు, వివిధ బ్యాంకులు అమలు చేసే పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాలు దోహదపడుతాయన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి తదితర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ కో–ఆర్డినేటర్ బాబూరావు, నోడల్ ఆఫీసర్ సాయికుమార్, ఏపీఎం పెంచల బాబు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శేషవాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. 16న ఉదయం సూర్యప్రభ వాహన, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహన సేవలు, 17న ఉదయం హనుమంత వాహన, రాత్రి 7 గంటలకు గరుడ వాహన సేవలు, 18న ఉదయం పల్లకి సేవ, సాయంత్రం 5 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి 7 గంటలకు గజవాహనోత్సవం, 19న ఉదయం వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహనోత్సవం ఉంటాయని దేవస్థానం చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి తెలిపారు. 20న శ్రీవారి ఏకాంతసేవ, రాత్రి 8 గంటలకు అగ్నిగుండ మహోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



వెంకటాచలం : దివ్యాంగులు తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అక్బర్‌అలీ సూచించారు. మండలంలోని ఎర్రగుంట వద్దనున్న దివ్యాంగుల సంయుక్త ప్రాంతీయ కేంద్రంలో దివ్యాంగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో శారీరక వైకల్యం ఉన్న వారికి టైలరింగ్,అంధులకు డేటా ఎంట్రీలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణానంతరం ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మనోజ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడూరు కాలువలో వ్యక్తి మృతదేహం



తోటపల్లిగూడూరు : మూడ్రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి మృతదేహం చింతోపు సమీపంలోని కోడూరు కాలువలో గురువారం లభ్యమైంది. ఎస్సై జంపానికుమార్ కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన పొన్నూరు ప్రసాద్(57) గత కొన్నేళ్లుగా నరుకూరులోని ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తున్నాడు. మూడ్రోజుల క్రితం ఆశ్రమం నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసుల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చింతోపు ఆంజనేయపురం సమీపంలోని కోడూరు కాలువలో ప్రసాద్ మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. ఇది అదృశ్యమైన ప్రసాద్‌దిగా కుటుంబ సభ్యులు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని పోలీసులు శవపరీక్షల నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై జంపానికుమార్ తెలిపారు.

టిడ్కో గృహాల పంపిణీని వేగవంతం చేయండి

• కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో ఉన్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో మెప్మా, టిడ్కో, విద్యుత్, తదితర విభాగాల అధికారులతో గురువారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా శర్మద మాట్లాడుతూ వెంకటేశ్వరపురం, అల్లీపురం, కొండ్లపుడి, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తిచేసుకుని సిద్ధంగా ఉన్న గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. గృహాలకు సంబంధించిన తాళాలు అందజేసి కరెంట్ కనెక్షన్లు స్వయంగా తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేషన్ నుంచి ప్రత్యేక బృందాలను ఆయా గృహ సముదాయాల వద్ద నియమించి ప్రణాళికాబద్ధంగా పంపిణీ ప్రక్రియ జరిగేలా సంబంధిత విభాగాల అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లను గృహాల పంపిణీలో భాగస్వామ్యం చేస్తూ లబ్ధిదారులకు సమాచారం అందజేసేలా చూడాలన్నారు. టిడ్కో గృహాల ప్రాంగణాలను శుభ్రం చేసి అవసరమైన పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో టిడ్కో ఎస్ఈ జాన్ సైమన్‌రావు, ఈఈ ఉమాశంకరశాస్త్రి, మెప్మా పీడీ రవీంద్ర, కార్పొరేషన్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, విద్యుత్‌శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈ మధుసూదన్‌రెడ్డి, భానునాయక్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గృహాల స్వాధీనం

కార్పొరేషన్ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించే ప్రక్రియను గురువారం మధ్యాహ్నం నుంచి యుద్ధప్రాతిపదికన ప్రారంభించారు. ఇందు కోసం కార్పొరేషన్ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి వచ్చిన వారికి గృహాలను స్వాధీనం చేశారు. ఈ ప్రక్రియను పక్కా ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు.



అల్లీపురంలోని టిడ్కోగృహాలను లబ్ధిదారులకు స్వాధీనం చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

రూ.7.50 కోట్ల భూ పరిహారం అందజేత



సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

• హర్షం వ్యక్తం చేసిన కొమ్మరపూడి రైతులు
• సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం
• ఎంపీ ఆదాలకు కృతజ్ఞతలు

నెల్లూరు రూరల్: జగనన్న కాలనీకి సేకరించిన భూములకు సంబంధించి కొమ్మరపూడికి చెందిన 65 మంది రైతులకు పరిహారాన్ని ప్రభుత్వం వారి ఖాతాల్లో బుధవారం జమచేసింది. ఈ భూములకు సంబంధించిన రైతులకు పరిహారాన్ని అందించే విషయంలో వివిధ కారణాలతో రెవెన్యూ అధికారులు జాప్యం చేశారు. రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం ఎట్టకేలకు నేరుగా రైతుల ఖాతాల్లో రూ.7.50 కోట్లను గురువారం జమచేసింది. దీంతో బాధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ నెట్టెం శ్రీధర్‌నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.సీఎం రైతుల సమస్యలపై ఎంతో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని కొనియాడారు. అనంతరం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రగిరి చిన్నయ్య, జీ ప్రసాద్, జనార్దన్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు త్వరగా పూర్తిచేయండి

• మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కేవీఆర్ పెట్రోల్‌బంకు కూడలి వద్ద జరుగుతున్న నగర సుందరీకరణ పనులను మేయర్ స్రవంతి 36వ డివిజన్ ఇన్‌చార్జి పిండి సురేష్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహాయ సహకారాలతో ఇప్పటికే రూ.1.50 కోట్లతో డివైడర్ల సుందరీకరణ పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. మరో రూ.3 కోట్లకు సంబంధించిన పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయని వివరించారు. వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. స్థానిక నేతలు జ్యోతి, మస్తానమ్మ, తిరుపతి, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు పుష్కర కుంభాభిషేకం మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. తొలిరోజు మహాగణపతిపూజ, తీర్థ సంగ్రహణం, విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 17న అష్టబంధన సమర్పణ, విశేష సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత సర్వమంత్ర హోమం, జంట నాగదేవతలకు అభిషేకం, మంగళహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న రుద్ర హోమం, పూర్ణాహుతి, ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 36 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శిల్పానికి మహా కుంభాభిషేక పూజలు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, మయూర వాహనసేవ ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంలో భాగంగా 2024 – 25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ప్రవేశానికి cse.ap.gov.inలో ఈ నెల 23 నుంచి వచ్చే నెల్లో 14లోపు నమోదు చేసుకోవాలని డీఈఓ రామారావు గురువారం తెలిపారు. అనాథలు, హెచ్‌ఐవీ బాధిత, దివ్యాంగ పిల్లల కోసం ఐదు.. ఎస్సీలకు 10.. ఎస్టీలకు నాలుగు.. బలహీన వర్గాలకు ఆరు శాతం మేర సీట్లను కేటాయించారని చెప్పారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించనున్నారని వివరించారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

పొదలకూరు : బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలని తాటిపర్తి పశువైద్యాధికారి డాక్టర్ సీ మురళీకృష్ణారెడ్డి సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కోళ్ల ఫారాల్లో మృతి చెందిన కోళ్ల శ్యాంపిళ్లను వైరాలజీ టెస్ట్ నిమిత్తం భోపాల్‌కు పంపామని తెలిపారు. కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూ కారణమనే నివేదిక తమకు ఇంకా అందలేదన్నారు. కానీ బర్డ్‌ఫ్లూ అనే అనుమానంతో ఉన్నత స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తమకు సూచించారని చెప్పారు. దీనిపై శుక్రవారం చాటగొట్లలో కోళ్ల పెంపకం దారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాటల పోటీలు రేపు



ఎస్పీబీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఏపీజేఏసీ నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): అభినవ ఘంటసాల పాటూరి శ్రీనివాసులు పుట్టినరోజును పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ జస్టిస్ టు ఆల్ ఆర్టిస్ట్స్ కమిటీ (ఏపీజేఏసీ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పాటల పోటీలను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ కమిటీ నిర్వాహకులు శ్రీనివాసచక్రవర్తి తెలిపారు. ఆదిత్య నగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులోని ఎస్పీబీ విగ్రహానికి ఏపీఏజేసీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో ఉదయం 9 నుంచి సాయంత్రం 3గంటల వరకు పాటల పోటీలు జరుగుతాయని తెలిపారు. 15 ఏళ్లు దాటిన వారు ఎవరైనా పోటీల్లో పాల్గొనవచ్చని చెప్పారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కళాకారులు, కళాభిమానులు పోటీల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ సభ్యులు పాటూరి శ్రీనివాసులు, ఆనంద్, శామ్యూల్, సుబ్బారెడ్డి, చక్రవర్తి, రాజు, ముజీబ్, సునీల్, శీను, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఆదాలకు సన్మానం



నెల్లూరు రూరల్: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి రావు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ వినోద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు పదవీ బాధ్యతలు రావడానికి సహకరించినందుకు ఎంపీని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు ఉన్నారు.

హెచ్‌ఐవీ, సుఖ వ్యాధులపై కళాజాత



కళాజాతను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ ఎం పెంచలయ్య

నెల్లూరు సిటీ: జిల్లాలో హెచ్‌ఐవీ, సుఖ వ్యాధుల నివారణకు ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కళాజాత బృందంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎం పెంచలయ్య తెలిపారు. నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో హెచ్‌ఐవీ, సుఖవ్యాధులపై కళాజాతను బుధవారం ఆయన జెండాఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సుఖ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి ఎస్‌కే ఖాదర్‌వలి మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదనే భావనను ప్రజల్లో అవగాహన కల్పించాలని కళాబృందానికి సూచించారు. డెమో అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్‌లో జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లూరు అర్బన్, రూరల్ మండలాల్లో అర్హులైన వారి కోసం జర్నలిస్టుల కమిటీ సభ్యులతో కలిసి వారం రోజుల్లో అనువైన స్థలాలు గుర్తించాలని నెల్లూరు ఆర్డీఓకు సూచించారు. నెల్లూరు నగరం మినహా కావలి, కందుకూరు, ఆత్మకూరు, నెల్లూరు డివిజన్లలో ఇళ్ల స్థలాల కోసం భూమి సిద్ధంగా ఉన్నందున అర్హులుగా గుర్తించిన వారి జాబితాను ఇన్‌చార్జి ఆమోదం తీసుకుని స్థలాల పంపిణీకి చర్యలు చేపట్టాలని సమాచారశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ మలోల, జిల్లా సమాచారశాఖ డీడీ సదారావు, కమిటీ సభ్యులు సీహెచ్ మస్తాన్‌రెడ్డి, వీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నెల్లూరు(బారకాసు): వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని కలెక్టరేట్ సెంటర్, మూలాపేట, అలంకార్‌సెంటర్, తదితర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన వారు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేషన్ హార్టీకల్చర్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, యాత్ర కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజసేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు రూరల్: సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని విక్రమ సింహపురి వర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి అన్నారు. బుజబుజనెల్లూరు సమీపంలోని బురాన్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జయభారత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరు జీవీఆర్‌ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవాదృక్పథంతో పనిచేయాలన్నారు. అనంతరం వైద్యుడు ఓబులేషు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జాకీర్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు, జీవీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ అందజేత



కుట్టు మెషీన్‌ను అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

నెల్లూరు రూరల్: అల్లీపురం ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతాదారురాలు గౌరికి ఆ బ్యాంకు ఆర్‌ఎం ఎన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం కుట్టు మెషీన్ అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సీ దేవేంద్రనాథ్ మాట్లాడుతూ నెల్లూరు రీజియన్ పరిధిలోని పది బ్రాంచ్‌లు సమాజసేవకు ఎంపికవగా, అందులో అల్లీపురం బ్రాంచ్ కూడా ఉందన్నారు. సీఎస్సార్ నిధులతో ఖాతాదారురాలి జీవనోపాధికి కుట్టు మెషీన్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ శారద, క్యాష్ ఆఫీసర్ మస్తాన్‌బాబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణంతో జ్ఞాన సముపార్జన



అష్టలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న దత్తవిజయానందతీర్థస్వామి



పూజల్లో పాల్గొన్న భక్తులు

• మైసూరు దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానందతీర్థస్వామి

నెల్లూరు(బృందావనం): భగవద్గీత పారాయణంతో జ్ఞాన సముపార్జన కలుగుతుందని, తద్వారా విచక్షణతో జీవనం సాగించగలమని మైసూరు దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానందతీర్థ స్వామి అనుగ్రహభాషణ చేశారు. నగరంలోని సుజాతమ్మకాలనీలోని అవధూత దత్తపీఠం–నెల్లూరు శాఖకు చెందిన శ్రీకృష్ణయోగ, అష్టలక్ష్మి మందిరంలో శ్రీసూక్త యాగం, శ్రీచక్రార్చనను గురువారం నిర్వహించారు. స్వర్ణాంబిక స్వర్ణమహాలక్ష్మికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా దత్త విజయానందతీర్థస్వామి భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ భగవద్గీత విశిష్టతను వివరించారు. ప్రతిజీవికి జ్ఞానం ఎంతో ప్రధానమన్నారు. అకారణంగా జీవులపై ద్వేషం తగదన్నారు. తోటి వారిపై ద్వేషాన్ని వీడాలన్నారు. భగవన్నామస్మరణతో ద్వేషం దరిచేరదన్నారు. భగవన్నామస్మరణతో భక్తి, ముక్తిని పొందాలన్నారు. భగవన్నామస్మరణ భజనలతో ఆరోగ్యం ఒనగూరుతుందన్నారు. దత్తపీఠాధీశ్వరులు గణపతి సచ్చిదానందస్వామికి నెల్లూరు ఆశ్రమమంటే ఎంతో ఇష్టమని, ఆయన అనుగ్రహంతో రథసప్తమి పూజలు నిర్వహించేందుకు ఆగమనం చేశామన్నారు. గణపతి సచ్చిదానందస్వామి రచించిన దివ్యనామ సంకీర్తనలను ఆలపించిన బాలలు, వారికి శిక్షణ ఇచ్చిన సర్వేపల్లి సోదరీమణులు శ్రేయ,రాజ్యలక్ష్మికు మంగళశాసనాలు అందించారు. ప్రతి ఏకాదశి నాడు శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలోని శ్రీకృష్ణభగవానుని సన్నిధిలో భగవద్గీత పారాయణం నిర్వహించి విద్యార్థులను ఉన్నతపౌరులుగా తీర్చిదిద్దాలని గురువు షేక్ నజీర్‌బాషాగురూజీకి దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు సూచించారు. అనంతరం భగవద్గీత పారాయణం, భజన పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎస్కేజీబీఎస్ ట్రస్ట్ ఎగ్జిక్యూటీవ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు రేబాల పట్టాభిరామిరెడ్డి, అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి, పచ్చిపాల ప్రమీలమ్మ, మస్తాన్‌రెడ్డి, సీసీ రత్నం, ప్రవీణ్‌కృష్ణ,సురేష్‌కొల్లం,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి పూజలు

రథసప్తమి సందర్భంగా అష్టలక్ష్మి మందిరంలో శుక్రవారం ఉదయం 6గంటలకు దత్తవిజయానందతీర్థస్వామి స్వహస్తాలతో రథసప్తమి పూజ, ఆదిత్య హృదయ పారాయణం, 10గంటలకు శ్రీచక్రార్చన, మహాసౌర హోమం, సాయంత్రం 5గంటలకు సరస్వతీపూజ ,6గంటలకు దివ్యనామ సంకీర్తన, తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘ ఎన్నిక



ముక్కు రాధాకృష్ణగౌడ్

నెల్లూరు(బారకాసు): రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడిగా ముక్కు రాధాకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో గురువారం జరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కోడూరు ధనేష్‌నాయుడు, కార్యదర్శిగా దామెర్ల శివప్రసాద్, సహాయక కార్యదర్శిగా గంజం పెంచలప్రసాద్, కోశాధికారిగా కోసూరు వెంకటసుధీర్, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ నరేష్‌యాదవ్, తాళ్ల పెంచల్‌కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్ల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.